'ప్రజావాణి'కి 105 వినతులు



వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

కంఠేశ్వర్, డిసెంబర్ 30 : ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 105 వినతులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ అంకిత్, ట్రైనీ కలెక్టర్ సంకేత్‌కుమార్, డీఆర్డీవో సాయాగౌడ్, డీపీవో శ్రీనివాస్‌రావు, ఆర్డీవో రాజేంద్రకుమార్‌కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి, త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు

కంఠేశ్వర్, డిసెంబర్ 30 : లయన్స్‌క్లబ్ ఆఫ్ నిజామాబాద్ డైమండ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని నాగారం క్రీడా మైదానంలో ఆదివారం క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు శిల్ప రాజేశ్వర్ మాట్లాడుతూ క్లబ్ సేవా కార్యక్రమంలో భాగంగా యువకులను క్రీడల్లో ప్రోత్సహించడానికి పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. నిజామాబాద్ కాల్స్ టీం విజేతగా నిలువగా.. ఐటీఐ టీం రెండో స్థానంలో నిలిచింది. అధ్యక్షుడు సిర్ప రాజేశ్వర్ చేతుల మీదుగా జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో కోశాధికారి రాజు, సెక్రటరీ ఎర్ర శ్రీనివాస్, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

పరీక్ష ఫీజు గడువు తేదీని పొడిగించాలి

డిచ్‌పల్లి, డిసెంబర్ 30 : టీయూ పరిధిలోని పీజీ మొదటి సెమిస్టర్, మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల ఫీజు చెల్లింపు తేదీని పొడిగించాలని టీయూ ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వర్సిటీ ఏబీవీపీ అధ్యక్షుడు సాయికుమార్ మాట్లాడుతూ.. వరుస ప్రభుత్వ సెలవులతో విద్యార్థులు పరీక్షల ఫీజు చెల్లించకలేకపోయారని తెలిపారు. విద్యార్థుల సమస్యను దృష్టిలో పెట్టుకుని పరీక్ష ఫీజు చెల్లింపు గడువును పొడిగించాలని కోరారు. స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ అమృత్‌చారి, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ మోహన్, నాయకులు సమీర్, అక్షయ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ముగ్గురికి జైలుశిక్ష
న్యూసెన్స్ కేసులో మరొకరికి..

వినాయక్‌నగర్, డిసెంబర్ 30: జిల్లా కేంద్రంలో ట్రాఫిక్, నాల్గోటౌన్, రూరల్ పోలీసు స్టేషన్ల పరిధిల్లో సీఐ ప్రసాద్, ఎస్సైలు శ్రీకాంత్, మహ్మద్ ఆరీఫ్ ఆధ్వర్యంలో ఆదివారం డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో మద్యం తాగి వాహనాలను నడుపుతున్న 29 మందిపై కేసులు నమోదు చేసి, స్పెషల్ జ్యుడిషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట సోమవారం హాజరుపర్చారు. ఆర్మూర్ పట్టణానికి చెందిన కిరణ్‌కుమార్, శంకర్‌కు రెండు రోజులు, శ్రీనివాస్‌కు ఒక రోజు జైలు శిక్ష విధిస్తూ మెజిస్ట్రేట్ తీర్పు వెలువరించారు. మిగతా 25 మందికి రూ.3,500 జరిమానా విధించారు. ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రాంతంలో న్యూసెన్స్ చేసిన స్థానిక గాయత్రీ నగర్‌కు చెందిన శ్రీపాద్‌పై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపర్చగా ఒకరోజు జైలు శిక్ష విధించినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

నీల కంఠేశ్వరాలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ కవిత

మేయర్ భర్త దండు శేఖర్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ

సుభాష్‌నగర్/ ఖలీల్‌వాడి, డిసెంబర్ 30 : జిల్లా కేంద్రంలోని నీలకంఠేశ్వరాలయాన్ని ఎమ్మెల్సీ కవిత సోమవారం సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. సోమవతి అమావాస్యను పురస్కరించుకొని ముక్కంటి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు సుహాస్ సఖాయ్, చంద్రశేఖర్ ఆమెకు తీర్థ ప్రసాదాలు ఇచ్చి ఆశీర్వదించారు. ఆలయ ప్రాంగణంలోని శిఖరాన్ని దర్శించి నమస్కారం చేసుకున్నారు. ఎమ్మెల్సీ వెంట విశాలిని రెడ్డి, సుమన, జాగృతి ప్రతినిధులు, బీఆర్ఎస్ మహిళా కార్యకర్తలు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

నిజామాబాద్ నగర మేయర్ దండు నీతూ కిరణ్ భర్త దండు శేఖర్‌పై ఇటీవల దాడి జరిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో దండు శేఖర్‌ను ఎమ్మెల్సీ కవిత పరామర్శించారు. తెలంగాణ జాగృతిలో పని చేసిన రఘుపతి క్రాంతికుమార్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. మానవ హక్కుల వేదిక నేత, సీనియర్ న్యాయవాది గొర్రెపాటి మాధవరావు మృతికి సంతాపం తెలిపారు. ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఎమ్మెల్సీ వెంట బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు ఆయేషా ఫాతిమా తదితరులు ఉన్నారు.

గొర్రెపాటి మాధవరావుకు నివాళి

సంతాపం తెలిపి మౌనం పాటిస్తున్న న్యాయవాదులు

వినాయక్‌నగర్,డిసెంబర్ 30: నిజామాబాద్ బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది గొర్రెపాటి మాధవరావు మృతికి సోమవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల ఆధ్వర్యంలో సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో అదనపు జిల్లా జడ్జి శ్రీనివాస్‌రావు, సీనియర్ సివిల్ జడ్జి శ్రీకాంత్ బాబు , జూనియర్ సివిల్ జడ్జిలు చైతన్య, హరికృష్ణ, జిల్లా కోర్టు పీపీ రాజేశ్వర్ రెడ్డి, గవర్నమెంట్ ప్లీడర్ ఎం. సుదర్శన్ పాల్గొన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్ మోహన్ మాట్లాడుతూ.. నాలుగు దశాబ్దాలకు పైగా న్యాయవాదిగా కొనసాగి, పౌరసమాజానికి మాధవరావు చేసిన సేవలు మరువలేనివన్నారు. ఆయన మరణం న్యాయవాద సమాజానికి తీరని లోటని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు మంథని రాజేందర్, సీనియర్,జూనియర్ న్యాయవాదులు రాజు, సురేశ్, దీపక్,కవితారెడ్డి,జగద్వీశర్ రావు,రాజారెడ్డి, భాస్కర్, పరుచూరి శ్రీధర్, రవీందర్, ఆశ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

డబ్బులు ఇవ్వలేదని తండ్రిని చంపిన తనయుడు

రుద్రూర్, డిసెంబర్ 30: తనయుడి చేతిలో ఓ తండ్రి హత్యకు గురయ్యాడు. ఈ సంఘటన మండలంలోని అంబం గ్రామంలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన హైమద్(65)కు ఇద్దరు భార్యలు. కొంతకాలం క్రితం ఇద్దరూ మృతిచెందగా.. రెండో భార్య కొడుకు మహబూబ్(బబ్లు)తో కలిసి ఉంటున్నారు. మద్యానికి బానిసైన మహబూబ్ తరచూ తండ్రితో డబ్బుల కోసం గొడవపడేవాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి గొడవపడగా.. డబ్బులు ఇవ్వకపోవడంతో తండ్రి హైమద్‌పై దాడి చేశాడు. ఛాతిలో, కడుపులో పిడి గుద్దులు కురిపించడంతో హైమద్ అక్కడికక్కడే మృతి చెందాడు. సోమవారం ఉదయం స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న ఎస్సై సాయన్న, సీఐ కృష్ణ సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతుడి పెద్దభార్య కొడుకు జమిల్ ఫిర్యాదు మేరకు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ, ఎస్సై తెలిపారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

విద్యార్థులకు ప్రశ్నలు వేసి జవాబులు రాబడుతున్న బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో

పొతంగల్, డిసెంబర్ 30 : చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యక శ్రద్ధ తీసుకోవాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో సూచించారు. సోమవారం ఆయన మండలంలోని కారేగాం జడ్పీహెచ్ఎస్‌ను సందర్శించారు. విద్యా బోధన పై ఆరా తీశారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడారు. అన్ని సబ్జెక్టుల్లో విద్యార్థులు పట్టు సాధించేలా బోధన చేయాలని సూచించారు. ఆయన వెంట పాఠశాల హెచ్ఎం కొలంబస్, ఉపాధ్యాయులు ఉన్నారు.

డీఈఈసెట్-24 అభ్యర్థులకు మరో అవకాశం

2 నుంచి 4 వరకు వెబ్ ఆప్షన్ల ఎంపిక

ఖలీల్‌వాడి, డిసెంబర్ 30: నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో డీఎల్ఈడీ, డీపీఎస్ఈ కోర్సులకు డీఈఈసెట్-24 రాసిన అభ్యర్థులు ఫేస్-1, ఫేస్-2లో వెబ్ ఆప్షన్లు ఎంపిక చేయనివారికి జనవరి 2 నుంచి 4వ తేదీ వరకు మరోసారి అవకాశం కల్పించినట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వెబ్ ఆప్షన్ల ఎంపిక చేసుకున్న తర్వాత జనవరి 9 నుంచి 12 వరకు deecet.cdse.telangana. gov.in వెబ్ సైట్ నుంచి అలాట్‌మెంట్ లెటర్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఎంపిక చేసుకున్న కళాశాలలో సంబంధిత ధ్రువీకరణపత్రాలను సమర్పించి అడ్మిషన్ పొందాలని పేర్కొన్నారు.

యువతిని మోసం చేసిన నిందితుడిపై కేసు

వినాయక్‌నగర్, డిసెంబర్ 30: ఓ యువతికి మాయమాటలు చెప్పి మోసం చేసిన నిందితుడికి కోర్టు జైలు శిక్ష విధించినట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. నిర్మల్ జిల్లాకు చెందిన ఓ యువతిని అదే ప్రాంతానికి చెందిన వాగ్మారే గౌతమ్ అనే యువకుడు ఈనెల 13న నిజామాబాద్ నగరానికి తీసుకువచ్చి లోబర్చుకున్నాడు. తనను మోసం చేశాడంటూ గౌతమ్‌పై సదరు యువతి ఈ నెల 14న నిర్మల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు నిందితుడిపై జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి, ఆ కేసును ఈనెల 17న నిజామాబాద్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు. దీంతో కేసు నమోదు చేసి, నిందితుడు గౌతమ్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారు. న్యాయమూర్తి ఉత్తర్వుల మేరకు నిందితుడిని జైలుకు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో వెల్లడించారు.

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ కవిత బాన్సువాడ నియోజకవర్గ నేతలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి చందూర్ మండలం నుంచి పార్టీ నాయకులు ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. –చందూర్, డిసెంబర్ 30

నూతన బస్టాండ్ నిర్మించాలని వినతి

పొతంగల్/శక్కర్‌నగర్, డిసెంబర్ 30 : మండల కేంద్రంలో నూతన బస్టాండ్ నిర్మించి, ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు వారు బోధన్ ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాస్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏరియా కార్యదర్శి నన్నేసాబ్ మాట్లాడుతూ.. బస్టాండ్ శిథిలావస్థకు చేరిందని, నూతన బస్టాండ్ నిర్మించాలన్నారు. బస్టాండ్ స్థలం కబ్జాకు గురైందని, ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం పొతంగల్ మండల కన్వీనర్ పట్నం రాములు, మోస్రా మండల కన్వీనర్ మేకల మల్లేశ్, వర్ని కన్వీనర్ మహ్మద్ ఖాన్, కేవీపీఎస్ నాయకుడు పోశెటి పాల్గొన్నారు.

వృద్ధురాలు అదృశ్యం

ఉమారాణి

వినాయక్‌నగర్, డిసెంబర్ 30: నగరంలోని బ్యాంక్ కాలనీకి చెందిన ముత్యం ఉమారాణి(62) అదృశ్యమైనట్లు నాల్గోటౌన్ ఎస్సై శ్రీకాంత్ సోమవారం తెలిపారు. ఆదివారం మహాలక్ష్మి ఆలయానికి వెళ్లివస్తానని ఇంట్లోంచి బయటికి వెళ్లి తిరిగిరాలేదని పేర్కొన్నారు. ఆమె కోసం వెతికినా ఆచూకీ లభించలేదని, ఆమె కుమారుడు జ్ఞానేశ్వర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సదరు మహిళ ఆచూకీ తెలిసిన వారు ఫోర్త్ టౌన్ ఎస్సై-87126-59840, నగర సీఐ-87126-59836 నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.

సంక్షిప్తంగా..

- **రాష్ట్ర బీసీ అధ్యాపకుల సంఘం కార్యదర్శిగా విఠల్ :** ధర్పల్లి, డిసెంబర్ 30 : రాష్ట్ర బీసీ అధ్యాపకుల సంఘం కార్యదర్శిగా మండల కేంద్రానికి చెందిన మామిడి విఠల్‌ను ఎన్నుకున్నారు. తెలంగాణ బీసీ అధ్యాపకుల సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి గౌరవ అధ్యక్షుడిగా ఆర్.కృష్ణయ్య హాజరుకాగా.. కోర్ కమిటీ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. తనపై నమ్మకముంచి కార్యదర్శిగా నియమించిన కోర్ కమిటీ సభ్యులు, గౌరవ అధ్యక్షుడు కృష్ణయ్యకు విఠల్ కృతజ్ఞతలు తెలిపారు.
- **రుద్రూర్‌లో వాహనాల తనిఖీ:** రుద్రూర్, డిసెంబర్ 30: ప్రతి వాహనదారుడు తన వాహనానికి సంబంధించిన పత్రాలను వెంట ఉంచుకోవాలని రుద్రూర్ ఎస్సై సాయన్న సూచించారు. నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో సోమవారం ఆయన సిబ్బందితో కలిసి మండల కేంద్రంలో వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనాలను నడిపే ప్రతి ఒక్కరూ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. మైనర్లకు వాహనాలను ఇవ్వరాదని సూచించారు.
- **గ్రామాల్లో పర్యటించిన తహసీల్దార్ :** ధర్పల్లి, డిసెంబర్ 30 : మండలంలోని హోన్నాజీపేట్, నడిమి తండా, కోటాన్‌పల్లి గ్రామాల్లో తహసీల్దార్ మాలతి సోమవారం పర్యటించారు. పాఠశాలలతోపాటు ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల వద్దకు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని నిర్వాహకులు, ఉపాధ్యాయులకు ఆమె సూచించారు.
- **పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈవో :** ఇందల్వాయి, డిసెంబర్ 30: మండలంలోని లోలం ఎంపీపీఎస్ ఎంఈవో శ్రీధర్ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటశాలను ప్రారంభించారు. అనంతరం మధ్యాహ్న భోజనం ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను తనిఖీ చేశారు.
- **కొనసాగుతున్ననీటి విడుదల-** మోర్తాడ్, డిసెంబర్ 30: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి యాసంగి పంటల కోసం వివిధ కాలువల ద్వారా నీటివిడుదల కొనసాగుతున్నది. సోమవారం ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు 5500 క్యూసెక్కులు, లక్ష్మీకాలువకు 200 క్యూసెక్కులు, అలీసాగర్ ఎత్తిపోతలకు 540, గుత్ప ఎత్తిపోతలకు 270, సరస్వతీకాలువకు 600, మిషన్ భగీరథకు 231క్యూసెక్కుల నీటిని అధికారులు విడుదల చేస్తున్నారు.
- **మోచి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి సన్మానం -** వేల్పూర్, డిసెంబర్ 30: మోచి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన వేల్పూర్‌కు చెందిన సుధాకర్‌ను సోమవారం గ్రామస్తులు సన్మానించారు. మాజీ సర్పంచ్ తీగల రాధా మోహన్, సొసైటీ డైరెక్టర్ నల్లవెల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.
- **క్యాలెండర్ ఆవిష్కరణ-** మోర్తాడ్, డిసెంబర్ 30: కమ్మర్‌పల్లి పద్మశాలీ కల్యాణ మండపంలో సోమవారం పద్మశాలీ సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం మండల అధ్యక్షుడు తిరుపతి, ఉపాధ్యక్షుడు రాజుల కృష్ణమురళి, కోశాధికారి పోతు ధరణికుమార్, కమ్మర్‌పల్లి సంఘ అధ్యక్షుడు పిల్లమారి సుధాకర్, ఉపాధ్యక్షుడు హన్మంతు, డాక్టర్ హన్మంతు, రాజ్‌కుమార్, చిలివేరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.
- **నీటి సమస్య పరిష్కారం-** ఆర్మూర్‌టౌన్,డిసెంబర్30: పట్టణంలోని రెండో వార్డు పరిధిలో ఉన్న సంతోష నగర్ కాలనీలో నీటి సమస్యను పరిష్కరించినట్లు కౌన్సిలర్ సంగీత సోమవారం తెలిపారు. నీటి సమస్య ఉన్నదని కాలనీ వాసులు చైర్‌పర్సన్ లావణ్య దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె స్పందించి నీటి సమస్యను పరిష్కరించారని కౌన్సిలర్ తెలిపారు.
- **ప్రైవేట్ దోపిడీని అరికట్టాలి-** ఆర్మూర్‌టౌన్, డిసెంబర్30: రోగులను నిలువు దోపిడీ చేస్తున్న ప్రైవేట్ దవాఖానపై కఠిన చర్యలు తీసుకోవాలని దళిత హక్కుల పోరాట సమితి ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి మాధవి నరేశ్ డిమాండ్ చేశారు. పట్టణంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రోగుల వద్ద నుంచి ప్రైవేటు దవాఖానలు, స్కానింగ్ సెంటర్లు, ల్యాబుల నిర్వాహకులు అధిక ఫీజులు వసూలు చేస్తూ దోపిడీ చేస్తున్నారని అన్నారు. జిల్లా వైద్య శాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. సమావేశంలో నాయకులు రాజేందర్, శీను తదితరులు పాల్గొన్నారు.
- **నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు -** శక్కర్‌నగర్, డిసెంబర్ 30:డిసెంబర్ 31 సందర్భంగా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ రావు సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. రాత్రి సమయాల్లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా, మద్యం సేవించి వాహనాలు నడిపినా, ఓవర్ స్పీడ్‌తో వాహనాలు నడిపినా, త్రిబుల్‌రైడింగ్ చేసినా కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు.

కేంద్ర హోంశాఖ మంత్రిని భర్తరఫ్ చేయాలి

జిల్లా కేంద్రంలో నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్న వామపక్ష పార్టీల నాయకులు

బోధన్/ఆర్మూర్‌టౌన్/ఖలీల్‌వాడి, డిసెంబర్ 30: అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను భర్తరఫ్ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ. రమేశ్ బాబు డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నూర్జహాన్, శంకర్ గౌడ్, వై.గంగాధర్, నన్నేసాబ్, పోశెట్టి, మల్లేశ్, నర్సయ్య, గంగాధర్ పాల్గొన్నారు. ఆర్మూర్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజా పంథా నాయకులు అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్‌లో వామపక్షాల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్‌బాబు, వెంకట్‌రాములు, వనమాల కృష్ణ, కంజర భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రస్మా ఆధ్వర్యంలో అథ్లెటిక్స్ పోటీలు

ట్రోఫీ అందజేస్తున్న అతిథులు

మాక్లూర్, డిసెంబర్ 30: దాస్‌నగర్‌లోని శ్రీచంద్ర ఉన్నత పాఠశాలలో మాక్లూర్, ఆలూర్ మండలాల్లోని ప్రైవేట్ పాఠశాలల క్రీడా పోటీలను ట్రస్మా ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. జూనియర్, సబ్‌జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. పోటీలను ట్రస్మా జిల్లా అధ్యక్షుడు నిత్యానందం, మండల అధ్యక్షుడు గంగాధర్‌గౌడ్, ఆలూర్ ఎంఈవో నరేందర్ ప్రారంభించారు. ముగింపు కార్యక్రమంలో టీఆర్ఎస్ఎంఏ గౌరవ అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు, రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి యాదగిరి, ట్రస్మా మండల ప్రధాన కార్యదర్శి నర్సాగౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు పోల్కం శ్రీనివాస్, బాబూరావు పాల్గొన్నారు.

లీపు సంవత్సరంపై అవగాహన పెంచుకోవాలి

అవగాహన కల్పిస్తున్న విజయ ఆనందరావు

బోధన్, డిసెంబర్ 30: లీపు సంవత్సరం అంటే ఏదో నాలుగు సంవత్సరాలకు ఒకసారి వచ్చిపోయేదిగానే చాలా మందికి తెలుసని, కానీ దీనికి ఎంతో ప్రాముఖ్యత ఉన్నదని జనవిజ్ఞాన వేదిక నాయకుడు, రిటైర్డ్ హెచ్ఎం విజయ ఆనందరావు అన్నారు. సోమవారం పట్టణంలోని శ్రీ విజయసాయి హైస్కూల్‌లో 'లీపు సంవత్సరం భావన – విజ్ఞానం' అంశంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. లీపు సంవత్సరం భావనలో చరిత్ర, భూగోళ, ఖగోళ, భౌతిక, గణిత శాస్త్రాలకు సంబంధించిన విజ్ఞానం దాగి ఉన్నదని అన్నారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.కృష్ణమోహన్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక

ఎంపికైన విద్యార్థి

శక్కర్‌నగర్, డిసెంబర్ 30: బోధన్ పట్టణంలోని తెలంగాణ మైనార్టీ గురుకుల కళాశాల విద్యార్థి రమేశ్ రాష్ట్ర స్థాయి సీఎం కప్ ఖోఖో పోటీలకు ఎంపికయ్యాడు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. జనవరి 2 వరకు వరంగల్‌లో నిర్వహించనున్న పోటీల్లో పాల్గొంటాడని ప్రిన్సిపాల్ మహ్మద్ అబ్దుల్ బషీర్, పీఈటీ సుధాకర్, అధ్యాపకులు తెలిపారు.

ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తానని ఎమ్మెల్సీ కవిత హామీ

నవీపేట, డిసెంబర్ 30: మండలంలోని బినోలా గ్రామంలో వరసిద్ధి వినాయక ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్సీ కవిత ఆర్థిక సహాయం చేసేందుకు హామీ ఇచ్చినట్లు బినోలా సొసైటీ చైర్మన్ మగ్గిరి హన్మాండ్లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఎమ్మెల్సీ కవితను బినోలా గ్రామస్తులు సోమవారం కలిసి ఆలయ నిర్మాణానికి ఆర్థిక సాయం అందజేయాలని కోరారు. తన వంతు సాయం చేస్తానని ఎమ్మెల్సీ హామీ ఇచ్చినట్లు హన్మాండ్లు పేర్కొన్నారు. ఎమ్మెల్సీని కలిసిన వారిలో గ్రామ యువకుడు యోగేశ్, గ్రామస్తులు నరేశ్, బ్రహ్మయ్య, కిట్టు, నరేశ్, గిరీశ్ తదితరులు ఉన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఒక రోజు జైలు శిక్ష

నవీపేట, డిసెంబర్30: మండల కేంద్రంలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి, మద్యం మత్తులో వాహనం నడిపిన ఒకరికి ఒక రోజు జైలు శిక్ష విదిస్తూ సోమవారం స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జహాన్ బేగం తీర్పు చెప్పినట్లు ఎస్సై వినయ్ తెలిపారు. దర్యాపూర్‌కు చెందిన షేక్ ఇలియాస్ ఆరుబయట మద్యం సేవించి, బైక్ నడిపాడు. అతడిని పోలీసులు నిజమాబాద్ కోర్టులో హాజరు పర్చగా మెజిస్ట్రేట్ తీర్పును వెలవరించారు.

హోటల్ యజమానికి..

శక్కర్‌నగర్, డిసెంబర్ 30: నిబంధనలు అతిక్రమించి అర్ధరాత్రి వరకు హోటల్ కొనసాగించిన చాంద్‌పాషాకు ఒకరోజు జైలుశిక్ష విధిస్తూ బోధన్ సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ శేషతల్పశాయి సోమవారం తీర్పు చెప్పారు. బోధన్ పట్టణ సీఐ వెంకట నారాయణ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. నిబంధనలు అతిక్రమించి హోటల్‌ను కొనసాగించడంతో కేసు నమోదు చేసిన పోలీసులు చాంద్‌పాషాను కోర్టులో హాజరుపర్చారు. ఈ మేరకు న్యాయమూర్తి ఒకరోజు జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

Br.SIRIKONDA
THE NIZAMABAD DISTRICT CO-OPERATIVE CENTRAL BANK LTD., NIZAMABAD
Head Office:Nizamabad (Regd No.21494)
ప్రకటన
శ్రీ కనగందుల సతీష్ తండ్రి కనగందుల నారాయణ, వయస్సు: 33, వృత్తి: వ్యవసాయం, సర్వే నెంబర్ 242, భూమి విస్తీర్ణం 3.020 గ్రామం సిరికొండ, మండలం సిరికొండ జిల్లా నిజామాబాద్.
సిరికొండ గ్రామంలోని 242 సర్వే నెంబర్‌లోని 3.020 భూమి కర్షక మిత్రలోన్ కొరకు జతపరిచిన పత్రాల ప్రకారం, వెస్ట్ సైడ్ తాళ్లకుంట్ల చెరువు, వెస్ట్ సైడ్ కాంతం రెడ్డి, బక్కన్న, నార్త్ సైడ్ కాంతం రెడ్డి, సౌత్ సైడ్ భూమరెడ్డి, ఇట్టి యజమాని అయి ఉండి సంపూర్